ఘనంగా హనుమాన్ జయంతి

మెట్టుగూడలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మ్యాకల చంద్రశేఖర రావు (ఎమ్‌సీఆర్) ప్రజాసేవ వ్యవస్థాపక అధ్యక్షులు చంద్రశేఖర రావు

- అడ్డగుట్ట

మెట్టుగూడలో హనుమాన్ జయంతి వేడుకల్లో కార్పొరేటర్ రాసూరి సునీత రమేశ్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కార్పొరేటర్‌ను శాలువాతో సన్మానించారు.

- అడ్డగుట్ట

బొల్లారం డౌటన్ బజార్ హనుమాన్ ఆలయంలో అన్నదానం

జయనగర్ కాలనీలోని శ్రీ శివ సాయిరాం ఆలయంలో పూజలు చేస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

కంటోన్మెంట్, జూన్ 1 : బాలంరాయి ఎంఈఎస్ క్వార్టర్స్‌లోని శ్రీకాళి దుర్గాదేవి ఆలయ 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ రాజేశ్‌యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు వివేకానంద, కార్యదర్శి ఉమా మహేశ్, క్రుపాల్, వెంకటేశ్, రతన్ యాదవ్, రమేశ్, నాగేశ్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో బ్రహ్మోత్సవాలు

కంటోన్మెంట్ జయనగర్ కాలనీలోని శ్రీశివ సాయిరాం ఆలయ 19వ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఏడు గంటలకు గోపూజ, గణపతి పూజ, అఖండ దీపారాధన, గణపతి అభిషేకం రుద్రాభిషేకం, సుదర్శన, మహాలక్ష్మి హోమం నిర్వహించారు. పూజలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. శని, ఆది రెండు రోజులపాటు వార్షికోత్సవ పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజ కార్యక్రమంలో అజిత్ కల్యాణ్, శ్రీకాంత్, వర, పవన్ పాల్గొన్నారు.

మారేడ్‌పల్లిలోని పలు ఆలయాల్లో ..

మారేడ్‌పల్లి : మోండా డివిజన్ మారేడ్‌పల్లిలోని పలు ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు జరిగాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు చేరుకొని స్వామి వారికి పూజలు చేశారు. మారేడ్‌పల్లిలోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలోని అనుబంధ ఆలయమైన హనుమాన్ ఆలయం, మోండా మార్కెట్ రోడ్డులో ఉన్న పంచముఖి హనుమాన్ టెంపుల్, ఓల్డ్ మారేడ్‌పల్లి లోని భక్త హనుమాన్ ఆలయంలో కార్పొరేటర్ కొంతం దీపిక పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద అన్నదానం చేశారు.

అమీర్‌పేట్ : మోడల్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ కమ్యూనిటీ హాల్ ' సంస్కృతి 'లో శ్రీ హనుమాన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సనాతన భజన మండలి వారిచే ' బంటురీతి కొలువీయవయ్య రామా ' అంటూ జరిగిన రామ నామ సంకీర్తనంలో కాలనీ వాసులు పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు స్వామి వారికి అభిషేకం, ఆకు పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం సత్సంగ్ సభ్యులచే 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది.

బొల్లారం : హనుమాన్ జయంతి సందర్భంగా బొల్లారం డౌటన్ బజార్ హనుమాన్ ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.అనంతరం ఈఓ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమీర్‌పేట్ : మోడల్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

మారేడ్‌పల్లి : ఆశీర్వాదం తీసుకుంటున్న కార్పొరేటర్ దీపిక

గన్‌పార్కుకు తరలిన అడ్డగుట్ట నాయకులు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు శనివారం సాయంత్రం కార్పొరేటర్ కార్యాలయం నుంచి గన్‌పార్కుకు బయల్దేరి వెళ్లారు. అడ్డగుట్ట నుంచి వెళ్లిన వారిలో లింగాని శ్రీనివాస్, నక్క మధు, శ్రీనివాస్ గౌడ్, అమర్, మహ్మద్, నర్సింగ్, అయోధ్య, వడ్లూరి రవి, రాజు, శ్రీరాములు, సుజాత, చిన్న, విజయ ఉన్నారు.

- అడ్డగుట్ట

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా..



తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన వారికి బన్సీలాల్‌పేట్‌లోని అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద కార్పొరేటర్ కే హేమలతాలక్ష్మీపతి, బీఆర్ఎస్ నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

– బన్సీలాల్‌పేట్

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడో వార్డుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేబీ శంకర్ రావు, కార్యకర్తలతో కలిసి గన్‌పార్కు అమర వీరుల స్థూపం వద్ద క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్నారు.

– బొల్లారం

ఫీస్ట్ బాల్ పోటీలకు ఆదరణ

క్రీడాకారులకు కరచాలనం చేస్తున్న తెలంగాణ ఫీస్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ ప్రతాప్

కంటోన్మెంట్, జూన్ 1 : తెలంగాణ ఫీస్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి క్రీడామైదానంలో మూడో ఇంటర్ డిస్ట్రిక్ వన్డే టోర్నమెంట్ పోటీలు శనివారం జరిగాయి. పోటీలను తెలంగాణ ఫీస్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్ ప్రారంభించారు. తెలంగాణ ప్రాంతంలో ఫీస్ట్ బాల్ పోటీలకు మంచి ఆదరణ ఉంటుందని, రానున్న రోజుల్లో ఇతర క్రీడల మాదిరిగానే ఫీస్ట్ బాల్‌కు ప్రత్యేక క్రేజ్ వస్తుందన్నారు. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి 15 జట్లు పాల్గొన్నాయని, ప్రతిభ కనబరిచిన జట్లకు ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ అందజేశామని రాష్ట్ర ఫీస్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కొమ్ము వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్, కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ప్రభు కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు భరత్, అజిత్, శ్రీకాంత్, వర, పవన్ పాల్గొన్నారు.

వీఎస్టీ క్రాస్‌రోడ్స్‌లోని సరోజిని అకాడమీలో శనివారం వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు ముగిశాయి. ప్రతిభ చాటిన ప్లేయర్లకు పతకాలు అందించారు. కార్యక్రమంలో జాతీయ వాలీబాల్ మాజీ ప్లేయర్లు కిరణ్‌రెడ్డి, ధనంజయ్, కిరణ్, గౌస్, రవి, జంపయ్య, గణపతి, కోచ్ ప్రవీణ పాల్గొన్నారు.

గన్‌బజార్‌లో ఉర్సు ..

కంటోన్మెంట్ రసూల్‌పురలోని గన్‌బజార్ మైదానంలో హజ్రత్ గరీబ్ షా ఉర్సు వేడుకలు శుక్రవారం రాత్రి నిర్వహించారు. గన్ బజార్ వీధుల్లో తిరుగుతూ గంధోత్సవం నిర్వహించారు. ఉర్సు వేడుకల్లో కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

- కంటోన్మెంట్

రైల్లో ఓ ప్రయాణికుడు మృతి

మారేడ్‌పల్లి, జూన్ 1 : రైల్లో ఓ ప్రయాణికుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక లోని బీదర్ జిల్లా, తేగంపూర్‌నకు చెందిన అశోక్ (57) తన భార్య రేఖా బాయితో కలిసి గత నెల 23న వారణాసికి వెళ్లి 30న తిరిగి దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో సికింద్రాబాద్‌కు వస్తున్నారు. ప్రయాణం మధ్యమార్గంలో 31న కాజీపేట వద్దకు వచ్చే సరికి అతనికి జ్వరం రావడంతో అపస్మారక స్థితి లోకి వెళ్లగా.. తోటి ప్రయాణికులు రైల్వే టీటీకి తెలియజేశారు. వెంటనే అప్రమత్తమైన టీటీ సికింద్రాబాద్‌లోని రైల్వే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చే సరికి అంబులెన్స్, వైద్యులు సిద్ధంగా ఉన్నారు. రైలు ప్లాట్ ఫా రం పైకి రావడంతో అశోక్‌ను వైద్యులు పరిశీలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రినగర్‌లో నకిలీ వైద్యుడి గుర్తింపు

అడ్డగుట్ట, జూన్ 1 : వచ్చిరానీ వైద్యంతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న నకిలీ వైద్యులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య మండలి సభ్యులు ప్రతిభాలక్ష్మి అన్నారు. అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రాంతాల్లో ఎలాంటి వైద్యార్హతలు లేకుండా నడుపుతున్న పలువురు నకిలీ వైద్యుల క్లినిక్‌లపై మెడికల్ కౌన్సిల్ అధికారులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. అడ్డగుట్ట శాస్త్రి నగర్‌లోని తాసీల్దార్ కార్యాలయం సమీపంలో కొన్నేండ్లుగా శ్రీనివాస్ అనే నకిలీ వైద్యుడు నడుపుతున్న క్లినిక్‌పై దాడి చేశారు. శ్రీనివాస్‌పై గతంలో ఫిర్యాదులు ఉన్నాయని వారు తెలిపారు. ఎటువంటి సర్టిఫికెట్లు లేకపోయిన క్లినిక్‌ను నడుపుతూ యాంటిబయోటిక్ ఇంజెక్షన్లు, సెలైన్లు, స్టెరాయిడ్స్ ఇస్తూ డబ్బులు దండుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు.

మాన్‌సూన్ బృందాలు రెడీ ..

అంబర్‌పేట: వరద ముంపు సమస్యను ఎదుర్కొనేందుకు మాన్‌సూన్ బృందాలు రెడీ అయ్యాయి. శనివారం సికింద్రాబాద్ జడ్సీ రవికిరణ్ గోల్నాకలో డీసీ మారుతీదివాకర్, ఈఈ పేర్రాజు, డీఈలు రఘు, ప్రవీణ్, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలి

బేగంపేట్ టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బేగంపేట్ టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

అమీర్‌పేట్, జూన్ 1 : ద్విచక్ర వాహనాలు, కార్లు నడిపే వారు లైసెన్స్ కలిగి ఉండాలని బేగంపేట్ టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు పేర్కొన్నారు. మోటారు వాహన చట్టం 1988 ప్రకారం లైసెన్స్ లేకుండా వాహనం నడపడం అండర్ సెక్షన్ 181/177 కింద నేరంగా పరిగణించడం జరుగుతుందన్నారు. సవరించబడిన కొత్త వాహన చట్టం 2019 ప్రకారం లైసెన్స్ లేని డ్రైవింగ్‌కు రూ. 500 జరిమానా విధించేవారని, ఇప్పుడు రూ. 5 వేల వరకు జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉందన్నారు. 2023లో 6173 మంది, 2024లో 3300 మంది డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి బేగంపేట్ టీటీఐలో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. శనివారం ఎర్రగడ్డలోని ప్రాంతీయ టెలికాం శిక్షణ కేంద్రం విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు.. సురక్షితంగా ఉంటూ వాటి నుంచి ఎలా బయటపడవచ్చనే అంశాలపై టీటీఐ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఏసీపీ జి.శంకర్‌రాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ట్రిపుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సంస్థలో శిక్షణ పొందుతున్న 200 మంది విద్యార్థులు, ప్రిన్సిపాల్ వి.వి.సత్యనారాయణ, అడ్మిన్ వివేక్, టీటీఐ సిబ్బంది అయాన్, కృష్ణ, హీరో మోటర్స్‌కు చెందిన శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

రామిరెడ్డి క్రీడాకారులను ప్రోత్సహించారు..

రైల్వే అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ రామిరెడ్డిని సన్మానించిన జాతీయ క్రీడాకారులు, కోచ్‌లు, విద్యార్థులు

బన్సీలాల్‌పేట్, జూన్ 1 : రైల్వే చీఫ్ అథ్లెటిక్స్ కోచ్‌గా 25 ఏండ్లు పనిచేసి క్రీడాకారులను ప్రోత్సాహించిన అంతర్జాతీయ అథ్లెటిక్ క్రీడాకారుడు డాక్టర్ నీలపు రామిరెడ్డిని వక్తలు అభినందించారు. దక్షిణ మధ్య రైల్వే లాలాగూడ వర్క్‌షాప్‌లో చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూనే, రైల్వే అథ్లెటిక్స్ చీఫ్ కోచ్‌గా పనిచేసి, పదవీ విరమణ చేసిన డాక్టర్ నీలపు రామిరెడ్డి, సతీమణి వాసంతిరెడ్డి దంపతుల అభినందన సభను శనివారం సికింద్రాబాద్ న్యూబోయిగూడలోని రైల్ కళారంగ్ ఆడిటోరియంలో నిర్వహించారు.రైల్వే ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఏపీ, తెలంగాణ నుంచి వచ్చిన రైల్వే క్రీడాకారులు, అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులు హాజరై రామిరెడ్డి దంపతులను సన్మానించారు. విశాఖపట్నంలోని పెద వాల్తేరులో జన్మించిన రామిరెడ్డి 100కు పైగా మెడల్స్, అవార్డులు అందుకున్నారని, రైల్వే స్పోర్ట్స్ సెలెక్షన్ కమిటీ సభ్యుడిగా యువ క్రీడాకారులకు అపాయింట్‌మెంట్ ఇప్పించారన్నారు. ప్రపంచంలో అత్యంత వేగంగా పరుగెత్తిన అథ్లెట్‌గా ఖ్యాతి పొందారని, సియోల్ ఏషియన్ గేమ్స్‌లో గెలిచిన సందర్భంగా మాజీ సీఎం ఎన్‌టి.రామారావు చేతుల మీదుగా నంది పురస్కారం అందుకున్నారని, మాజీ సీఎంలు ఎన్.చంద్రబాబు నాయుడు, రోశయ్య చేతుల మీదుగా ఉత్తమ క్రీడాకారుడి అవార్డు , గౌరవ డాక్టరేట్లు అందుకున్నారని వారు తెలిపారు. వేడుకల్లో దక్షిణ మధ్యరైల్వే ఎంప్లాయీస్ సంఘ కార్యదర్శి మర్రి రాఘవయ్య, రామిరెడ్డి కుమారులు పునీత్‌రెడ్డి, డాక్టర్ లలిత్‌కమల్‌రెడ్డి పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణ స్మారక పురస్కారాలు

తెలంగాణ ప్రభుత్వం సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువకళావాహిని ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశం మందిరంలో పలువురు సినీ ప్రముఖులకు సూపర్‌స్టార్ కృష్ణ స్మారక పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు జస్టిస్ కె.లక్ష్మణ్ విచ్చేసి సూపర్‌స్టార్ స్మారక పురస్కారాలను అందజేశారు. డాక్టర్ పరుచూరి గోపాలకృష్ణ, పి.సాంబశివరావు, ఎస్‌వీ సుబ్బారాజు, మల్లికార్జున్‌రావు, రవీంద్రగోపాల్, ఎంవీ రఘు, సీ మాధవరావు అవార్డులు అందుకున్నారు.

- రవీంద్రభారతి

అనాథ పిల్లల నడుమ పుట్టినరోజు వేడుకలు

అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన 1969 తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు సుధాకర్ తన 75వ జన్మదినాన్ని విద్యానగర్‌లోని స్ఫూర్తి అనాథ పిల్లల ఆశ్రమంలో పిల్లల మధ్య శనివారం జరుపుకున్నారు. ఉదయం అక్కడ ఉన్న పిల్లలలందరికీ టిఫిన్ తినిపించి తాను కూడా వారితో కలిసి టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన 75వ జన్మదినాన్ని అనాథ పిల్లల మధ్యన జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. పిల్లలు చాలా క్రమశిక్షణతో ఉన్నారని తెలిపారు.

- అంబర్‌పేట

డయాబెటిస్‌పై అవగాహన కల్పించాలి

సుల్తాన్‌బజార్,జూన్ 1: చిన్నారులపై అత్యధికంగా ప్రభావం చూపుతున్న టైప్-1 డయాబెటిస్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ అన్నారు. శనివారం కాన్ఫరెన్స్ హాల్‌లో ఎండోక్రైనాలజీ విభాగం ఆధ్వర్యంలో డ్రీమ్ ఫోర్స్ సమ్మర్ క్యాంప్-2024ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దవాఖానలో 300కు పైగా టైప్-1 డయాబెటిస్ బారిన పడిన చిన్నారులకు రక్షణ కల్పించడంతో పాటు అధిక నాణ్యత కలిగిన ఇన్సులిన్‌ను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం ఆఫీసర్ జగన్నాథ్‌రెడ్డి, నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ మనీషాసహాయ్, సీఎస్ అడ్మిన్ ఆర్ ఎంవో డాక్టర్ శేషాద్రి, డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోలు సాయిశోభ, బండారి శ్రీనివాసులు, ఆర్ఎంవోలు సుష్మ, అనూరాధ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్: దళిత బహుజనుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.